కార్యకర్తలే పార్టీకి అండ

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు



మాట్లాడుతున్న సమన్వయకర్త వేమారెడ్డి, వేదికపై ఎమ్మెల్సీ మురుగుడు

మంగళగిరి: కార్యకర్తలే పార్టీకి అండ అని, వారికి ఏ ఆపద వచ్చినా తోడుగా నిలుస్తామని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వకర్త దొంతిరెడ్డి తెలిపారు. నగర పరిధిలోని ఆత్మకూరు జాతీయర హదారి వెంట ఉన్న పార్టీ కార్యాలయంలో దుగ్గిరాల మండల ముఖ్య నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. మండల పార్టీ మాజీ కన్వీనర్ శృంగారపాటి రత్నం అధ్యక్షతన జరిగిన సమావేశంలో వేమారెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీని మండలంలో మరింత బలోపేతం చేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు తాను అండగా ఉంటానన్నారు. ఇప్పటికీ చాలాసార్లు సీఎం చంద్రబాబు మాటలు విని ప్రజలు మోసపోయారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికలప్పుడు మాత్రమే పేదలు గుర్తుకు వస్తారని అధికారంలోకి వచ్చిన అనంతరం కార్పోరేట్ సంస్థలు, ధనవంతులకు మాత్రమే పనిచేస్తారని విమర్శించారు. దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం పేద ప్రజలకు అభివృద్ధికి బాటలు వేసిందని, దానికి రెండడుగులు ముందుకు వేసి ఆయన కుమారుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. మరోసారి ఆయన సీఎం అయితేనే మళ్లీ ప్రజలకు మంచి జరుగుతుందని ఆ దిశగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. మాజీ మంత్రి ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ మహా రాష్ట్రలో జరిగిన ఎన్నికలలో ప్రజలు ఓట్లు వేయలేదని ఈవీఎంలు ప్రధాన పాత్ర పోషించాయని కాంగ్రెస్ పార్టీ ఆరోపణలు సమాధానం చెప్పడం లేదన్నారు. ఈవీఎంలు అప్డేట్ అయ్యి.. మళ్లీ ఎన్నికలు జరిగితే అధికారపక్షానికే మేలు జరుగుతుందని, ప్రతిపక్షం గెలవదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పెనుమాకలో ఉచిత వైద్య శిబిరం



తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి రూరల్ పెనుమాకలో తెలుగు రైతు గుంటూరు జిల్లా అధ్యక్షుడు కళ్ళం రాజశేఖరరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ లక్ష్మీ ఫౌండేషన్ హాస్పిటల్ సహకారంతో ఈ వైద్య శిబిరం నిర్వహించామని, సుమారు 165 మందికి పైగా వైద్య సేవలు పొందారన్నారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్ కంటి పరీక్షలు వైద్యులు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారని తెలిపారు. డాక్టర్ కల్యాణి, ఇమ్రాన్, గురవయ్య, రజియాలు తమ వైద్యసేవలను అందించారన్నారు. ఈ కార్యక్రమంలో కళ్లం శివగోవిందరెడ్డి, పలగాని ఆంజనేయులు, లతీష్ రెడ్డి, నాగేశ్వరరావు, అక్బర్ ఖాన్, చలపతిరావు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామికి నాగవల్లీ దళార్చన



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఉన్న దక్షిణాముఖ ఆంజనేయస్వామికి ఆదివారం విశేష అర్చనలు నిర్వహించారు. ఉదయాన్నే పంచామృతాలతో స్వామికి అభిషేకాలు చేసి మన్యుసూక్తం పారాయణకావించారు. లక్ష తమలపాకులతో(నాగవల్లీ)అర్చనలు చేశారు. అర్చకులు నారాయణం ప్రసాదాచార్యుల ఆధ్వర్యంలో పలువురు రుత్వికులు సహస్రనామాలతో పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

5న హైందవ శంఖారావం సభ



తెనాలి: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 5వ తేదీన విజయవాడలో జరగనున్న హైందవ శంఖారావం సభకు ప్రజలను సన్నద్ధులను చేసేందుకు ఆదివారం రూరల్ మండల గ్రామం నందివెలుగులో సమావేశం నిర్వహించారు. తెనాలి సరస్వతి శిశుమందిర్ అధ్యక్షుడు యర్రంశెట్టి హనుమంతరావు, న్యాయవాద పరిషత్ సభ్యుడు పోతూరి నాగేంద్రం సమీక్షించారు. స్థానిక బీజేపీ నాయకుడు టి.కోటేశ్వరరావు, జనసేన నేత శేషగిరి, టీడీపీ నాయకుడు బొప్పన శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు. ఈనెల 11వ తేదీన గీతాజయంతి ఉత్సవాలను 'శౌర్యదివస్'గా ఘనంగా నిర్వహించాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో కార్తిక వన సమారాధనలు



తెనాలిఅర్బన్: అందరు ఐకమత్యంతో జీవిస్తు పలువురికి ఆదర్శంగా నిలవాలని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. కృష్ణ బలిజ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం చినరావూరులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో కార్తిక వన సమారాధనను నిర్వహించారు. ముఖ్యఅతిధిగా పాల్గొన్న ఆలపాటి మాట్లాడుతూ కృష్ణ బలిజ సంఘీయుల అభివృద్ధికి తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు కోలా అశోక్ కుమార్, కౌన్సిలర్ అన్నం పిన్నారావు, టీడీపీ నాయకులు తాడిబోయిన శ్రీనివాసరావు, మహ్మద్ కుద్దూస్, కావేటి వేణుగోపాలరావు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మంచి జీవన శైలి కలిగి ఉండండి



తెనాలిఅర్బన్: మంచి జీవనశైలిని కలిగి ఉండటం వల్ల వ్యాధులు దరిచేరవని హ్యాపీ మల్టీ స్పెషాలిటీ హస్పటల్ నిర్వాహకులు డాక్టర్ పావని ప్రియాంక పేర్కొన్నారు. హ్యాపీ హస్పటల్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ పావని ప్రియాంక, డాక్టర్ మహేష్ కిరణ్, డాక్టర్ ఈదర సుప్రియ చౌదరి, డాక్టర్ నారాయణ స్వామి, డాక్టర్ మంజులవాణిలు రోగులకు వైద్య సేవలు అందించారు. అలాగే బీపీ, షుగర్, ఈసీజీ తదితర పరీక్షలను ఉచితంగా చేశారు. ఉదయ్, భాస్కర్, రమణమ్మ, సతీష్, పూజిత, సంధ్య, అశోక్ పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు కమిటీ రద్దు శోచనీయం


మాట్లాడుతున్న షేక్ సుభాని

తాడేపల్లిరూరల్ : గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాజ్యాంగ బద్ధంగా 2023లో జీవో 47 ద్వారా నియమించిన వక్ఫ్ బోర్డు కమిటీని రద్దు చేస్తూ కూటమి ఉపసంహరించుకోవడం శోచనీయమని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. ఆదివారం దుగ్గిరాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యేలు, ముతవల్లీలు, స్థానిక సంస్థలు అన్ని కేటగిరీలలో నియామకాలు జరిగిన ఐదేళ్ల పదవీ కాలం ఉన్న కమిటీని రద్దు చేయడం తగదన్నారు. 2018లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కమిటీ వేస్తే 2019లో సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రద్దు చేయలేదని గుర్తుచేశారు. ఆ బోర్డు కాలపరిమితి ముగిసిన తరువాత మాత్రమే కొత్త బోర్డును 2023లో వేశారని తెలిపారు. వక్ఫ్ బోర్డు కమిటీకి సంబంధించిన ఈ అంశం ఇంకా రాష్ట్ర హైకోర్టులో పెండింగ్‌లో ఉందన్నారు.

ఘూటింగ్ బాల్ విజేతలకు అభినందన


విజేతలను అభినందిస్తున్న హెచ్‌ఎం, పాలక మండలి సభ్యులు, ఉపాధ్యాయులు

తాడికొండ: రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారని తాడికొండ ఎస్వీవీ హైస్కూల్ హెచ్‌ఎం ఏవీవీ వరప్రసాద్, పీఈటీ సుంకర శ్రీనివాస్ తెలిపారు. నవంబర్ 23, 24, 25 తేదీలలో అనంతపురం జిల్లా నార్పల మండలంలో జరిగిన షూటింగ్ బాల్ పోటీల్లో రాష్ట్ర జట్టు తరుపున తమ పాఠశాల విద్యార్థులు రామ్ ప్రకాష్, ఫయాజ్, వీరాంజనేయులు, అయ్యప్ప, ఏడుకొండలు పాల్గొని, అత్యుత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. అండర్-17లో విన్నర్స్‌గా, అండర్-19లో రన్నర్స్‌గా నిలవడం తమ పాఠశాలకు గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా పాలక వర్గ సభ్యులు త్రిపురనేని మల్లేశ్వరరావు, యెడ్డూరి హనుమంతరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు ఎన్వీ రమణయ్య, మదమంచి చంద్రశేఖర్, విద్యా కమిటీ ఛైర్మన్ రవిబాబు పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

తాడికొండ: మండలంలోని పాములపాడు గ్రామంలో మహిళ ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు తాడికొండ సీఐ కె.వాసు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లాం గ్రామానికి చెందిన వసుంధరకు పాములపాడు గ్రామానికి చెందిన నాగరాజుతో వివాహం జరిగింది. కుటుంబంలో మనస్పర్థల కారణంగా నాగరాజు వసుంధరను వేధిస్తున్నాడని, సర్దిచెప్పినా మార్పు రాకపోవడంతో విసిగిపోయిన వసుంధర ఇంటి నుంచి పారిపోయిందని పేర్కొన్నారు. లాం గ్రామంలోని అమ్మమ్మ ఇంటి వద్ద పిల్లలను వదిలి ఇంటి నుంచి వెళ్లిపోయిందని తెలిపారు. వసుంధర తల్లి చనిపోవడంతో అమ్మమ్మ అలివేలు పెంచి పెళ్లి చేసింది. భర్త వేదింపుల కారణంగా తమ మనుమరాలు ఇంటినుంచి వెళ్ళిపోయిందని, కుటుంబ సభ్యులకు ఫోన్‌చేసి తాను ఆత్మహత్య చేసుకుంటానని చెప్పిందని అమ్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాడికొండ సీఐ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం


వ్రతంలో పాల్గొన్న దంపతులు

నగరంపాలెం: కార్తిక మాసం సందర్భంగా నందివెలుగు రోడ్డు వస్తనగర్‌లోని శ్రీకామ్యసిద్ధి పద్మావతి గోదా దేవి వెంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఆదివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. సుమారు 300 మందికి పైగా దంపతులు వ్రతాన్ని ఆచరించారు. ఆలయం నాలుగు వైపుల ఉన్న ఉప ఆలయాల్లోని స్వామి వార్లను భక్తులు దర్శించుకున్నారు. పూజా కార్యక్రమాలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఛైర్మన్ బూసి రెడ్డి మల్లేశ్వరరెడ్డి మాట్లాడుతూ తొమ్మిదేళ్లుగా కార్తిక మాసంలో సామూహిక సత్యనారాయణ వ్రతాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. టీటీడీ అందించిన విగ్రహాలను ఆలయంలో ప్రతిష్ఠించామని తెలిపారు. టీటీడీలో జరిగే కార్యక్రమాలను ఈ ఆలయంలో కొనసాగుతాయని చెప్పారు. అలాగే ఏటా బ్రహ్మోత్సవాలు, కల్యాణాలు, నిత్యాన్నదానం చేస్తామని చెప్పారు. ఆలయ కార్యదర్శి శేషగిరి, కోశాధికారి నాగేశ్వర రావు పాల్గొన్నారు.

అంగడి చెన్నయ్యకు ఘన నివాళి


రైతు కూలీ సంఘ మహా సభల సావనీర్‌ను ఆవిష్కరించిన సీపీఐ(ఎంఎల్) నాయకులు

లక్ష్మీపురం: ప్రజలను పాలిస్తున్నా పాలక వర్గాలు ప్రజల కష్టాల గురించి, ప్రజలు పడుతున్న ఇబ్బందులు పట్టడం లేదని దేశంలోని సహజ వనరులను, ఖనిజాలను పెట్టుబడి దారులకు, కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర నాయకులు కిషోర్ బాబు అన్నారు. చుట్టుగుంట సెంటర్‌లోని అంగడి చెన్నయ్య స్థూపం వద్ద వర్ధంతి సభ ఆదివారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సభకు ఉల్లిగడ్డ నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ 70 శాతం పైగా ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నా రైతాంగం ఆత్మహత్యలకు పాల్పడుతున్నారంటే వ్యవసాయం ఎంత దుర్భరంగా తయారయ్యిందో అర్థం అవుతుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది చేరుకూరి సత్యనారాయణ, రైతు కూలీ సంఘ నాయకులు వి.వీరబాబు, ఎం.శోభారాణి, జిల్లా నాయకులు నీలాద్రి రాంబాబు, మార్నెళ్ల అంజిరెడ్డి, ఏఐఎఫ్టీయూ జిల్లా నాయకులు కె.కోటేశ్వరరావు, వెంకటాద్రి పాల్గొన్నారు.

రెచ్చిపోయిన టీడీపీ నాయకులు

మేడికొండూరు: మేడికొండూరు గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కొరివి చెన్నయ్య కుమారుడు అజయ్ పై టీడీపీ నాయకులు దాడి చేశారు. చర్చి ప్రాంగణంలో ఉన్న అజయ్ అతని తమ్ముడు విజయ్‌పై అదే గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షుడు తలతోటి శ్యాంబాబు, అతని తమ్ముడు రత్నరాజు మద్యం మత్తులో రాళ్లతో దాడి చేశారు. దీంతో కొరివి అజయ్‌కు గాయాలయ్యాయి. దాడి చేయడమే కాకుండా అసభ్య పదజాలంతో దూషించారు. దీంతో క్షతగాత్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

'సూర్య ఘర్'తో గృహాలకు వెలుగు

ఫిరంగిపురం: ప్రధాన మంత్రి మోదీ ప్రారంభించిన సూర్య ఘర్ పథకం ద్వారా గృహాలకు ఉచిత విద్యుత్ సాధ్యమవుతుందని దివ్య సోలార్ పవర్ సిస్టమ్ ఆర్గనైజర్ పి.జోజప్ప అన్నారు. మండల కేంద్రంలో దివ్య సోలార్ పవర్ సిస్టమ్ కార్యాలయాన్ని బాల ఏసు దేవాలయం సహాయ విచారణ గురువు రవీంద్ర ఆదివారం ప్రత్యేక ప్రార్ధనలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జోజప్ప మాట్లాడుతూ ప్రభుత్వ రాయితీతో గృహాలకు సోలార్ రూఫ్ టాప్ ఆన్ గ్రేడ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వం గృహానికి రూ.78వేలు రాయితీ ఇస్తోందని, మిగిలిన నగదు బ్యాంకుల ద్వారా రునం తీసుకోవచ్చని చెప్పారు. దీనిద్వారా అధిక విద్యుత్ బిల్లులు చెల్లించే అవకాశం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో పీఎల్ మరియన్న, కె.జోజిరెడ్డి, జ్ఞానయ్య, రాయప్ప, రమేష్ పాల్గొన్నారు.

వరకట్నం వేధింపులపై కేసు నమోదు

తాడికొండ: అధిక కట్నం తీసుకురావాలని భర్త వేధించినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాడికొండ సీఐ కె వాసు ఆదివారం తెలిపారు. వివరాల ప్రకారం.. తాడికొండ మండలం లాం గ్రామానికి చెందిన పాశం సత్యవతి అచ్చంపేట మండలం కొత్తపల్లికి చెందిన పాశం వెంకటేశ్వర్లుతో వివాహం జరిగింది. అయితే ఇటీవల తన భర్త, కుటుంబ సభ్యులు అధిక కట్నం తీసుకురావాలని తనను వేదిస్తూ ఇబ్బంది పెడుతున్నారని సత్యవతి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

వడ్డమానులో పేకాట శిబిరంపై దాడి

తాడికొండ: తుళ్ళూరు మండలం వడ్డమాను గ్రామంలోని చింతల తోపులో జరుగుతున్న పేకాట శిబిరంపై పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఎస్ఐ అంకమ్మరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడులలో ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. రూ. 3420 నగదు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు.

చెరువులో మునిగి డ్రైవర్ మృతి

తాడికొండ: మద్యం మత్తులో ఆర్టీసీ డ్రైవర్ చెరువులో దిగి ఈదలేక మృతి చెందిన ఘటన తుళ్ళూరు మండలం పెదపరిమి గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెదపరిమి గ్రామానికి చెందిన అత్తోట మధుబాబు(50) లారీ, బస్సు డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. ఆదివారం ఉదయం మద్యం సేవించి చెరువులో దిగి ఈత కొట్టేందుకు యత్నించగా మునిగిపోయాడు. స్థానికులు పడవల సాయంతో చెరువులో వెదికి మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి భార్య బుజ్జి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ బాబురావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని అసుపత్రికి తరలించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



తెనాలిఅర్బన్: ఆర్ఎస్ ఇండియా ఫౌండేషన్ నూతనంగా రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను చినరావూరులోని ఆర్ఎస్ చర్చిలో ఆదివారం రెవరెండ్ పల్లె శామ్యూల్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాలెండర్‌లో ప్రతిరోజు బైబిల్‌కు సంబంధించిన వాక్యాలను పొందుపరచటం జరిగిందన్నారు. సంఘ సభ్యులు ఝాన్సీరాణి, శివకుమారి, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అప్రమత్తత అవసరం



తెనాలిఅర్బన్: హెచ్‌ఐవీపై ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని జేఎంజే కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ షైనీ పేర్కొన్నారు. ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా జేఎంజే కళాశాల ఆధ్వర్యంలో ఆదివారం సుల్తానాబాద్‌లో ర్యాలీని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంతో పోల్చుకుంటే హెచ్‌ఐవీ బారిన పడే వారి సంఖ్య చాలా తగ్గిందన్నారు. హెచ్‌ఐవీ సోకిన వారు మందులు సక్రమంగా వాడుకుంటే జీవన ప్రమాణం పెరిగే అవకాశం ఉందని చెప్పారు. హెచ్‌ఐవీని పూర్తిగా నియంత్రించేందుకు ప్రజలందరు సహకరించాలని పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ అరుణ సుజాత, అధ్యాపకులు డాక్టర్ శారదమేరి, డాక్టర్ అమూల్ మేరి, డాక్టర్ నిర్మలజ్యోతి, హేమలత తదితరులు పాల్గొన్నారు.

భూములు దోచేస్తున్న స్వామీజీలపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న నార్నె వెంకట సుబ్బయ్య

తాడేపల్లిరూరల్ : భూములు దోచేస్తున్న స్వామీజీలపై చర్యలు తీసుకోవాలని భారత హేతువాదుల సంఘం అధ్యక్షులు నార్నె వెంకట సుబ్బయ్య అన్నారు. ఆదివారం తాడేపల్లి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ నాయకులు కూడా స్వామీజీల వద్ద మోకరిల్లడం దారుణమన్నారు. నెల్లూరులో రామదూత అనే దొంగ స్వామి గత 25 సంవత్సరాల నుంచి భూములు ఆక్రమిస్తున్నారని, అప్పటి ప్రినిసపల్ సెక్రటరీకి ఫిర్యాదు చేయగా ఆ భూములు స్వాధీనం చేసుకోమని అధికారులకు ఆదేశాలు జారీ చేశారని గుర్తుచేశారు. అయినా అది అమలు కాలేదని, దొంగ స్వాములకు అధికారుల ఏజంట్లుగా పనిచేస్తున్నారని ఆరోపించారు. సీఎం చంద్రబాబు నాయుడు రామదూత స్వామి ఆక్రమించిన భూములను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అప్పటి కలెక్టర్, ఎమ్మార్వోలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి భారత హేతువాద సంఘ నాయకులు యర్రంశెట్టి జగన్మోహనరావు, ఎన్‌టీఆర్ జిల్లా హేతువాదుల సంఘం నాయకులు ఎం.లక్ష్మీనారాయణ, వెంకటేష్ పాల్గొన్నారు.

వెన్నులో వణుకు


కంతేరులో ఏపుగా పెరిగిన బెండ తోట


కళకళలాడుతున్న సోయా చిక్కుడు పంట


పూత, పిందె దశలో ఉన్న మినుము

తాడికొండ: ఫెంగల్ తుపాను అన్నదాతల వెన్నులో వణుకు పుట్టిస్తోంది. గత మూడు రోజులుగా వాతావరణం చల్లబడి గాలులు వీస్తుండటంతో పాటు చిరు జల్లులు కురుస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం అపరాల పంటలైన మినుము, కంది పూత దశలో ఉండగా, వరి రైతులు యంత్రాల ద్వారా కోతలు చేపట్టేందుకు పంటను ఆరబెడుతున్నారు. మరోవైపు కూరగాయ పంటలు కూడా ఏపుగా పెరిగి కోత దశలో ఉన్నాయి. భారీ వర్షాలు కురిస్తే చేతికందొచ్చిన పంటలు ఎక్కడ నేలపాలు అవుతాయోనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్‌లో కురిసిన భారీ వర్షాలు పంటలను నిలువునా ముంచడంతో తీవ్రంగా నష్టపోయిన రైతులు రబీ సీజన్‌లో కూడా అదే పునరావృతమైతే తీవ్ర నష్టం చవిచూడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో రెండు రోజుల పాటు ఈ తుపాను ప్రభావం కొనసాగనున్న నేపథ్యంలో చిరు జల్లులతోనే సరిపెడుతుందా లేక అకాల వర్షం కురిసి ముంచుతుందా అనే ఆందోళన రైతులు ఉన్నారు.

ఐఎంఏ ఆధ్వర్యంలో డాక్టర్ వుల్లక్కి జయంతి

తెనాలి రూరల్: తెనాలి పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు, మేజర్ కాకుమాను వుళ్ళక్కి జయంతిని తెనాలి ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) తెనాలి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. బోసురోడ్డులోని ఐఎంఏ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐఎంఐ కార్యాలయానికి ఆయన పేరు పెట్టడం గురించి వైద్యులు వివరించారు. తెనాలి శాఖ అధ్యక్షుడు డాక్టర్ కె.అనిల్‌కుమార్, డాక్టర్ కొత్తమాసు శ్యామ్‌ప్రసాద్, డాక్టర్ జె.విజయలక్ష్మి, డాక్టర్ చందు సాంబశివుడు, డాక్టర్ వేమూరి శేషగిరిరావు, డాక్టర్ పాలడుగు ఉమామహేశ్వరరావు, డాక్టర్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ నాటక రంగ వికాసానికి కొడాలి కృషి


మాట్లాడుతున్న సాంబశివరావు

నగరంపాలెం: గ్రామీణ నాటక రంగ వికాసానికి నాటక రచయితగా కొడాలి గోపాలరావు కృషి చిరస్మరణీయమని నాటక రంగ పరిశోధకులు కందిమళ్ల సాంబశివరావు అన్నారు. లాడ్జిసెంటర్‌లోని బీఈడీ కళాశాల ఆవరణలో నిర్వహిస్తోన్న విశాలాంధ్ర పుస్తక మహోత్సవంలో ఆలూరి బైరాగి సాహిత్య వేదికపై కొడాలి గోపాలరావు నాటక సాహిత్యంపై ఆదివారం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ గ్రామసీమల్లోని రైతులు, రైతు కూలీల సమస్యలను కొడాలి తన నాటకాల్లో చూయించేవారని అన్నారు. తెలుగు నాటక రంగంలో కొడాలి, కొర్రపాటి గంగాధరరావు శతాధిక నాటక రచయితలుగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. రాష్ట్ర అరసం ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్, నాటక రచయిత నాగభూషణం, మృత్యుంజయరావు, సంగిరెడ్డి హనుమంత్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రానికి ప్రత్యేక హోదా అవసరం


సమావేశంలో మాట్లాడుతున్న మేధావుల ఫోరం కన్వీనర్ పి.ఎస్.మూర్తి

లక్ష్మీపురం: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కోసం ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని మేధావుల ఫోరం కన్వీనర్ పి.ఎస్.మూర్తి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ప్రత్యేక హోదాపై హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్యలు' పై సంస్థ సీనియర్ సభ్యులు ఎల్.మురళీకృష్ణ అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇచ్చే విషయంలో రాతపూర్వక హామీ లేనందున, దానిని వ్యాజ్యంగా తీసుకోలేమని హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించటం ధర్మం కాదన్నారు. పార్లమెంట్‌లో ఇచ్చిన హామీకి అనుగుణంగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చేలా కేంద్రాన్ని ఆదేశించాలని ప్రజాశాంతి పార్టీ అధినేత కె.ఎ.పాల్ దాఖలు చేసిన పిల్‌పై హైకోర్టు వ్యాఖ్యలు ఆంధ్ర రాష్ట్ర ప్రజలను నిరాశకు గురిచేశాయన్నారు. రాజ్యాంగ చర్చా వేదిక కార్యదర్శి అవధానుల హరి మాట్లాడుతూ పార్లమెంటులో అప్పటి ప్రధాని మన్మోహన్ చేసిన ప్రకటనకు విలువ లేదని వాదించటం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయటమేనన్నారు. ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా తప్పనిసరి అవసరమని చెప్పారు. సమావేశంలో సీనియర్ విశ్లేషకులు, విశాలాంధ్ర విజ్ఞాన సమితి మాజీ జనరల్ మేనేజర్ గూడవల్లి నాగేశ్వరరావు, రాజశేఖర్, సదాశివం ప్రసంగించారు.

ఉత్సాహంగా దేశభక్తి గీతాలాపన



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలో భరతమాత పూజా దినోత్సవాల్లో భాగంగా ఆదివారం జూనియర్స్, సీనియర్స్ విద్యార్థులకు చేతిరాత, ఇంద్రజాలం, దేశ భక్తి బృందగానం పోటీలు నిర్వహించారు. సంస్కార భార తి అధ్యక్షులు ఇండ్ల శ్రీధర్ బాబు అధ్యక్షత వ హించగా, ఆయా పోటీల్లో గెలుపొందిన విజేత లకు వచ్చే నెల 26న బహుమతులు అందిస్తా మని తెలిపారు. రాష్ట్రంలోని పలు పాఠశాలల నుంచి 1,755మంది విద్యార్థులు హాజరవ్వగా, ఆలయ పాలక మండలి సహాయ కార్యదర్శి వూటుకూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.